క్లుప్తంగా

పదవీ విరమణ వయస్సు పెంపుపై హర్షం

వైవీయూ: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల పదవీ విరమణ వయసును 58 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు పెంచడంపై కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం నాయకులు జయరామరెడ్డి, ఆనంద్, భీమలింగయ్య హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఉర్దూ పోస్టులు చూపకపోవడం అన్యాయం

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కళాశాలలలోని అధ్యాపక పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ఉన్నతాధికారులు ఉర్దూ అధ్యాపక పోస్టులను పూర్తిగా మరచిపోయారని, ఒక్కటి కూడా ఉర్దూ లెక్చరర్ పోస్టు చూపించకపోవడం అన్యాయమని రూట లెక్చరర్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వసివుల్ల బక్తియారి సాహేబ్ అన్నారు. ఈ విషయమై మంగళవారం కడపలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. స్పందించిన డిప్యూటీ సీఎం సంబంధిత విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి నోటిఫికేషన్‌లో ఉర్దూ పోస్టులు చేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రూట రాష్ట్ర సమన్వయకర్త ముహమ్మద్ అయ్యూబ్, రాష్ట్ర అకడమిక్ వింగ్ కన్వీనర్ షహాబుద్దీన్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఖాజీపేట మండల సర్వేయర్ గురవయ్యను సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు చంద్రారెడ్డి, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం ఆర్డీఓ మధుసూదన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురవయ్య లంచం లేనిదే ఏ పనీ చేయడం లేదని ఆరోపించారు.

బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం జంతుశాస్త్రశాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 6,7 తేదీల్లో 'మానవ వ్యాధుల అధ్యయనం కోసం జంతు నమూనాలు : నైతిక విలువలు, ప్రత్యామ్నాయ మార్గాలు' అన్న అంశంపై సెమినార్ నిర్వహించనుండడం అభినందనీయమని వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం వైవీయూలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలిసి సెమినార్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సెమినార్ కన్వీనర్ డా. ఎన్. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ సెమినార్‌కు పలు పరిశోధన సంస్థల నుంచి సైంటిస్టులు విచ్చేసి ఉపన్యసించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దూరవిద్య సంచాలకులు ఆచార్య కె.కృష్ణారెడ్డి, ఉప సంచాలకులు డా. శ్రీధర్‌బాబు, జంతుశాస్త్ర అధ్యాపకులు డా. ఎస్.పి.వి. రమణ, డా. వి. అనుప్రసన్న, డా. ఏటీ వెంకటరమణారెడ్డి, డా. మరియాదాస్, మనస్వి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



ఇర్ఫాన్ జంక్షన్ వద్ద తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కడప అర్బన్: కడప నగరంలోని ఇర్ఫాన్ జంక్షన్ సమీపంలో ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ మంగళవారం చేపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను పట్టుకునేందుకు బ్రీత్ ఎనలైజర్ ద్వారా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసులను నమోదు చేయడంతో పాటు కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

బస్సులను జాగ్రత్తగా నడపాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని విద్యా సంస్థల బస్సులను జాగ్రత్తగా నడపాలని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ఈ. మీరా ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా నగర శివార్లలోని ఊటుకూరు సమీపంలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో విద్యాసంస్థల బస్సులు నడిపే డ్రైవర్లు , విద్యాసంస్థల యాజమాన్యాలు , తల్లిదండ్రుల కమిటీలకు రహదారి భద్రత, విద్యార్థులకు సురక్షితమైన ప్రయాణం కల్పించుట గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి , ఆర్అండ్‌బి డిప్యూటీ ఎస్ఈ మాధవి, మోటార్ వాహనాల తనిఖీ అధికారులు ప్రసాద్, లక్ష్మీ ప్రసన్న, ప్రైవేట్ విద్యాసంస్థల కమిటీ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, ఫైర్ ఆఫీసర్ శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాల పండుగ



వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమానికి హాజరైన మహిళలు





వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మేయర్ సురేష్‌బాబు

– ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాల పండుగలు సంవత్సరం పొడవునా చేయడం జరుగుతోందని ఉప ముఖ్యమంత్రి ఎస్ బి అంజాద్ బాషా, మేయర్ సురేష్ బాబు సంయుక్తంగా పేర్కొన్నారు. మంగళవారం శంకరాపురంలోని స్కౌట్ హాల్‌లో కడప నగరపాలక సంస్థ, మెప్మా ఆధ్వర్యంలో 4 వ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అంజాద్ బాషా మాట్లాడుతూ...వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమాన్ని నాల్గవ సంవత్సరం కూడా 35,525 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.32.81కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. ఈ నాలుగేళ్లలో కడప నగరంలోని లబ్ధిదారులకు సుమారు రూ.100 కోట్లను జగనన్న వైఎస్సార్ ఆసరా పథకం కింద అందించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వాల వలే ఇది మాటల ప్రభుత్వం కాదని, ఇది చేతల ప్రభుత్వం అన్నారు. మేనిఫెస్టో అంటే అంకెల గారడీ కాదని అది ఒక పవిత్రమైన భగవద్గీత, బైబిల్, ఖురాన్ లా భావించడం జరుగుతోందన్నారు.

– మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ అక్కచెల్లెమ్మల జీవితాల్లో మరిన్ని కాంతులు తీసుకురావాలని, వారి కుటుంబంలో సుస్థిరమైన ఆదాయం రావాలని, జీవనోపాధి మెరుగు పరచుకొనే విధంగా గత ఏడాది అమూల్, హిందూస్తాన్ యూనిలివర్, ఐ.టి.సి., ప్రోక్టర్ అండ్ గ్యాంబల్, అలానా వంటి వ్యాపార దిగ్గజాలతో మరియు బ్యాంకులతో ఒప్పందాలు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ ఏడాది అజియో, రిలయన్స్, గ్రామీణ వికాస కేంద్రం, టీనేజర్, మహీంద్ర – ఖేతి వంటి బహుళ జాతి సంస్థలతో ఒప్పందాలు చేసుకొని మీకు వ్యాపార మార్గాలు చూపించడం జరుగుతోందన్నారు. అమ్మ కడుపులోని బిడ్డ నుండి ఆప్యాయంగా ఆశీర్వదించే అవ్వ వరకు ప్రతి ఒక్కరి అవసరాలను గుర్తించి తగు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అమ్మఒడి. విద్యా దీవెన, వసతి దీవెన, చేయూత, సున్నా వడ్డీ, కాపు నేస్తం, కళ్యాణమస్తు, ఇళ్ళ పట్టాలు అక్కచెల్లెమ్మల పేరుతోనే ఇస్తున్నామన్నారు. నామినేటెడ్ పదవులలో 50 శాతం మహిళలకు కేటాయించడం జరిగిందన్నారు. అనంతరం మహిళా లబ్ధిదారులకు మెగా చెక్‌ను అందజేశారు.

– ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, హరూన్ గ్రూప్స్ ఎండీ అహ్మద్‌బాషా, పార్టీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్య యాదవ్, బండి ప్రసాద్, కిరణ్, త్యాగరాజు, దాసరి శివ, రామ్మోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు నాగేంద్ర, మల్లికార్జున, షఫీ, సుబ్బారెడ్డి, రామలక్ష్మిరెడ్డి, టీపీ వెంకట సుబ్బమ్మ, పత్తిరాజేశ్వరి, చైతన్య, మరియలు, హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

క్షీరాభిషేకం ..

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం స్వయం సహాయ సంఘాల మహిళలకు నాలుగు విడతల్లో పూర్తి రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం నిర్వహించారు.

సామాజిక మాధ్యమాల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్ఐ జీవన్‌రెడ్డి

వైవీయూ : సామాజిక మాధ్యమాలను అవసరం మేరకే వినియోగించాలని, తెలియని యాప్‌లు, సైట్ల జోలికి వెళ్లవద్దని కడప సైబర్ క్రైమ్ విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ ఎల్. జీవన్‌రెడ్డి సూచించారు. రాజీవ్‌గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ (ఆర్‌జీఎన్ఐవైడీ), భారత ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వశాఖ, వైవీయూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ×సైబర్ సెక్యూరిటీపై యువతకు అవగాహన₹ కల్పించేదిశగా మాస్టర్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమం రెండోరోజు మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అన్ని లావాదేవీలు ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టం ద్వారా జరుగుతున్న నేపథ్యంలో ప్రతి సమాచారం థర్డ్‌పార్టీకి వెళ్లే అవకాశం ఉందన్నారు. లోన్‌యాప్‌లు, కాల్ సెంటర్లు, పార్ట్‌టైం జాబ్స్, మ్యాట్రిమోనియల్ సైట్లను వినియోగించేటప్పుడు అత్యంత జాగురుకతతో ఉండాలన్నారు. ఎవరైనా నష్టపోతే వెంటనే సైబర్‌క్రైమ్.జీఓవి.ఇన్, సైబర్ క్రైమ్ విభాగాన్ని సంప్రదించాలన్నారు. 24 గంటల్లోపు సదరు అకౌంట్‌ను సీజ్ చేస్తామని తెలిపారు. అనంతరం ప్రోగ్రాం ఆఫీసర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఆర్‌జీఎన్ఐవైడీ ప్రోగ్రాం అండ్ సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకర్ ఎస్. బాలకృష్ణన్ సైట్లను హ్యాక్ కాకుండాల ఎలా కాపాడుకోవచ్చో అవగాహన కల్పించారు. టెక్నికల్ ఆఫీసర్ శ్రీధర్‌బాబు , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకట్రామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓలు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



మార్నింగ్ విజిట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు చేయాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్ చంద్ అన్నారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా నాగరాజుపేట, అంబేద్కర్ సర్కిల్– వై జంక్షన్ , అన్నమయ్య జంక్షన్–కృష్ణదేవరాయ సర్కిల్, దేవుని కడప రోడ్డు, మాసాపేట జంక్షన్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అంబేద్కర్ సర్కిల్– వై జంక్షన్ మార్గంలో డ్రైనేజీ కాలువ నిర్మాణం, నీటి ప్రవాహం సజావుగా ఉండేలా చూసుకోవాలన్నారు. పెండింగ్ ఉన్న పైకప్పులను త్వరగా పూర్తిచేయాలన్నారు. డ్రైనేజీ, రోడ్డు మధ్య గ్యాప్ లను భర్తీ చేయాలన్నారు.

డ్రైనేజీ కాలువలోకి వర్షపు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేయాలన్నారు. వీధి దీపాలన్నీ ఒకే సమయంలో ఆన్, ఆఫ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నమయ్య సర్కిల్‌లో ఎలక్ట్రికల్, ఫౌంటేన్ పనులు తక్షణం పూర్తి చేయాలన్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న కరెంట్ స్తంభాలు వెంటనే మార్చాలన్నారు. కృష్ణదేవరాయ సర్కిల్– అన్నమయ్య సర్కిల్ మధ్యలో ఉన్న ఆక్రమణలను తొలగించాలని, డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేయాలని చెప్పారు. డివైడర్లలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

– జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే పిల్లలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ అన్నారు. మంగళవారం కడప చిన్నచౌక్‌లో గల డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంపును నిర్వహించారు. ఈ క్యాంపులో స్నేహ పూర్వక న్యాయ సేవల పథకం–2015తో పాటు పలు చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సుభాష్, దిశ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు మురళి, గవర్నమెంట్ చిల్డ్రన్ హోం సూపరింటెండెంట్ వీరయ్య, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్రీనివాసులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు యాస్మిన్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మాధవీలత, వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్వని, పారా లీగల్ వాలంటీర్ దశరథరామిరెడ్డి, డాక్టర్ రవికుమార్, పాల్గొన్నారు.

ఘన నివాళి



గాంధీ చిత్రపటానికి ఘనంగా నివాళులను అర్పిస్తున్న వైద్యుల బృందం

కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల (రిమ్స్)లో మంగళవారం మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకుముందు చర్మవ్యాధుల విభాగంలో ప్రపంచ కుష్టు వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంను చర్మవ్యాధుల విభాగం హెచ్ఓడీ డాక్టర్ పెంచలయ్య, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సి. సుభాషిణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కె. నరోత్తమ్ రెడ్డి, డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చర్మవ్యాధుల విభాగం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్: మహాత్మాగాంధీ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ అహింసా మార్గంలో నడవాలని పాలకొండయ్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొండా సుబ్బయ్య అన్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కడప చెన్నూరు బస్టాండ్ వద్ద ఉన్న రెండో గాంధీ బొమ్మ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాయల్‌సేవా సమితి అధ్యక్షుడు రాయల్ కరీముల్లా, కడప పట్టణ బుక్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు



కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం



వల్లూరులో మెగా చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

వల్లూరు : రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రధాన ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి తెలిపారు. మండలంలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్ క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా నాలుగవ విడత సంబరాల్లో వారు రూ.5 కోట్ల 37 వేల 174 విలువ గల మెగా చెక్కును మహిళా సంఘాల సభ్యులకు పంపిణీ చేశారు. అనంతరం సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించి మాట్లాడారు. 15 సంవత్సరాలు సీఎంగా వున్న చంద్రబాబునాయుడు ప్రజలకు అనేక హామీలను ఇచ్చి మోసగించారని విమర్శించారు. మహిళల కష్టాలను చూసి చలించిన జగన్ 45 సంవత్సరాలకే మహిళలకు పెన్షన్ సౌకర్యం కల్పించాడన్నారు. దాన్ని రాకుండా చేయడానికి చంద్రబాబునాయుడు తన అనుచరుల ద్వారా కోర్టుకు వెళ్లి అడ్డగించారని విమర్శించారు. జగనన్న ఇచ్చిన హామీలను క్యాలెండర్ ప్రకారం అమలు చేసి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదును జమచేశారన్నారు. రాజకీయాలకు సంబంధం లేకుండా ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించాడన్నారు. రాబోవు ఎన్నికల్లో ఆచరణ సాధ్యం కాని హామీలతో తిరిగి ప్రజలను మభ్యపెట్టడానికి టీడీపీ సిద్ధమవుతోందని, వాటిని తిప్పికొట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేత ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, మండల స్పెషలాఫీసర్ బ్రహ్మయ్య, ఏసీ రఘునాథరెడ్డి, ఎంపీడీవో జయశ్రీ, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, ఏపీఎం శైలజ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నేతలు, ఇందిరా క్రాంతి పథం సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో....

పెండ్లిమర్రి : స్థానిక ఎంపీడీవో ఆవరణలో డ్వాక్రా మహిళలకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా క్రింద 811 స్వయం సహాయ సంఘాలకు రూ.7.70 కోట్ల మెగా చెక్కు మంగళవారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పంపిణీ చేసి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మహిళలు అన్నిరంగాల్లో ముందు ఉండాలని మహిళలకు పెద్ద పీట వేశాడన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, సర్పంచ్ నాగమల్లారెడ్డి, తహశీల్దార్ ఉదయ భాస్కర్‌రాజు, ఎంపీడీవో జగన్‌మోహన్ రెడ్డి, ఏరియా కోఆర్డినేటర్ రఘునాథ్‌రెడ్డి, ఏపీఎం వెంకటేశ్వరావు, మహిళలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

కడప వైఎస్ఆర్ సర్కిల్: భవన నిర్మాణ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ రాష్ట్ర డిప్యూటీ సెక్రెటరీ మద్దిలేటి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో ఈ నెల 28న జరిగిన ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా 5 వ మహాసభల్లో నూతన కమిటీ ఎన్నుకున్నామన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఉద్దె మద్దిలేటి, జిల్లా అధ్యక్షుడుగా బి. రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా కె. లింగన్న, డిప్యూటీ సెక్రటరీగా చిన్న ఓబన్న తో పాటు పలువురిని ఎన్నుకున్నామన్నారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

వల్లూరు : మండలంలోని పైడికాలువలో రూ.43.60 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్ర భవనం, లేబాకలో రూ.20.80 లక్షలతో డాక్టర్ వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం, కొప్పోలులో రూ.43.60 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనాలను మంగళవారం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిలు ప్రారంభించి మాట్లాడారు. దళారులకు, మోసాలకు తావులేకుండా పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించాలనే ధ్యేయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలను ఇస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జడ్పీటీసీ వెంకట సుబ్బయ్య, సర్పంచ్ చెన్నమ్మ, వైఎస్ఆర్‌సీపీ నేతలు ఓబీ సుబ్బారెడ్డి, గంగిరెడ్డి, నారాయణరెడ్డి, రామ సుబ్బారెడ్డి, రామాంజనేయరెడ్డి, రామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, దేవానందరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శివారెడ్డి, శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో రెండవసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజాకంటక విధానాలను అమలుపరుస్తూ, ప్రజలకిచ్చిన ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలిచ్చిందన్నారు. మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా నినాదాల ఆర్భాటాలే తప్ప ఒక్క మ్యాను ఫ్యాక్చరింగ్ ఫ్యాక్టరీ కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్ నాగ సుబ్బారెడ్డి , బషీరున్నీషా , ఎం వి సుబ్బారెడ్డి , సి.సుబ్రహ్మణ్యం, ఎస్ వెంకట శివ, పి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డీపీటీఓ వైఖరిపై నిరసన



గేట్ మీటింగ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : విశాఖ డీపీటీఓ ఉద్యోగ అసోసియేషన్ నాయకుల పట్ల వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరమని ఎన్ఎంయూఏ కడప రీజియన్ నాయకులు తెలిపారు. రెండు రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం టీ విరామ సమయంలో కడప నగరం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఎన్ఎంయూఏ కడప రీజియన్ నాయకులు గేట్ మీటింగ్ నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ కడప రీజియన్ సంయుక్త కార్యదర్శి దాస్, రీజినల్ వైస్ ప్రెసిడెంట్ సురేష్‌బాబు, కడప డిపో కార్యదర్శి శ్రీను, అసిస్టెంట్ సెక్రటరీలు , సంయుక్త కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పాఠశాలల్లో పనిచేసే టీచర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మున్సిపల్ టీచర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఫిబ్రవరి 1వ తేదీన కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం కడపలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ టీచర్లకు సర్వీస్ రూల్స్‌ను రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రిలే నిరాహార దీక్షలు

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను ప్రభుత్వం చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టనున్నారు. ఈ నెల 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు కడప కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు కోరారు. మంగళవారం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన చెస్ పోటీల్లో కడప గాంధీనగర్ మున్సిపల్ పాఠశాల విద్యార్థి లాస్యశ్రీ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయిలో మూడోస్థానంలో నిలిచింది. ఇందుకుగాను లాస్యశ్రీని మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సత్యసుజాతమ్మ అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ ఐజయ్య, పీఈటీలు రమేష్, ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవలు స్ఫూర్తిదాయకం

కడప రూరల్ : సామాజిక సేవలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మాతృశ్రీ ఐవీఎఫ్ క్లినిక్‌లో గైనిక్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ వై.ప్రమోద చేపడుతున్న సామాజిక సేవలను అభినందించారు. అనంతరం ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు పి.విష్ణు, స్త్రీ శక్తి సంస్థ అధ్యక్షురాలు సరస్వతి, బాసట స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు కె.ఈశ్వరయ్య మాట్లాడుతూ డాక్టర్ ప్రమోద ప్రతి మంగళవారం తన క్లినిక్‌లు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు.